సాక్షి కామారెడ్డి

గురువారం । 30 । జనవరి । 2025

7



చదువుల చెట్టుకు..
బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్కే డిగ్రీ కళాశాల రజతోత్సవాలను వచ్చేనెల 23న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- 8లో ▸



ఘనంగా మాఘమాస జాతర
జిల్లాలో బుధవారం మాఘమాస సందర్భంగా భక్తులు నదీ స్నానాలు ఆచరించి, ఆలయాలను దర్శించుకున్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /15.4

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

అయినా మారరు!

'కనిపించే మూడు సింహాలు న్యాయానికీ నీతికీ ధర్మానికీ ప్రతిరూపాలైతే.. కనిపించని ఆ నాలుగో సింహమేరా పోలీస్' అంటూ 'పోలీస్ స్టోరీ' సినిమాలో హీరో సాయికుమార్ చెప్పిన ఈ డైలాగ్ పోలీస్ శాఖ ఔన్నత్యాన్ని చాటింది. అయితే కొందరు అధికారులు డబ్బుపై కక్కుర్తితో శాఖకు మచ్చ తెస్తున్నారు. అవినీతి నిరోధక శాఖ దాడులు చేస్తున్నా అవినీతి అధికారుల్లో మార్పు రావడం లేదు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



- పెరిగిన అవినీతి నిరోధక శాఖ దాడులు
- రెండున్నర నెలల క్రితం ఏసీబీకి చిక్కిన ఎస్సై, రైటర్
- తాజాగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన లింగంపేట ఎస్సై

పోలీస్ పోస్టింగుల్లో పొలిటికల్ ముద్ర పరిపాటిగా మారింది. అధికారంలో ఉన్న వారు తమకు అనుకూలురైన అధికారులకు పోస్టింగులు ఇప్పించుకుంటారు. అనువైన స్థానాల కోసం పోలీస్ అధికారులు సైతం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం, ఎంతో కొంత మాట్లాడుకుని అనుకున్న పోస్టింగ్ సంపాదించుకోవడం సర్వసాధారణంగా మారింది. దీంతో పెట్టిన పెట్టుబడి నింపుకోవడానికి, అదనంగా నాలుగు రాళ్లు వెనకేసుకోవడానికి పలువురు అడ్డదారులు తొక్కుతున్నారు. బరితెగిస్తున్న అధికారులు ప్రతి కేసులోనూ ఎంతోకొంత లాగే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసు అధికారులు బాహాటంగా డబ్బుల గురించి మాట్లాడుతున్నారు. డబ్బు యావలో ముందూ, వెనకా చూసుకోకుండా చేస్తున్న అతి వారిని ఇబ్బందుల్లోకి నెడుతోంది. అందరి చేతుల్లో స్మార్ట్ ఫోన్లు వచ్చాయి. అన్ని చోట్లా ఏసీబీ అధికారుల నంబర్లు దొరుకుతున్నాయి. అధికారి డబ్బుల కోసం ఇబ్బంది పెడితే చాలు.. ప్రజలు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కుతుండడంతో పోలీసు శాఖ అప్రతిష్టపాలవుతోంది.

పర్యవేక్షణ పెరిగినా..

జిల్లాల విభజన తర్వాత అధికారుల పర్యవేక్షణ పెరిగింది. గతంలో జిల్లా అధికారులు ఠాణాలకు ఏడాదికో, రెండేళ్లకో వచ్చేవారు. చిన్న జిల్లాలు అయిన తర్వాత పరిధి తగ్గి అధికారులు ప్రతి ఠాణాను రెండు మూడు నెలల కోసారైనా చుట్టేస్తున్నారు. నెలనెలా జరిగే క్రైం మీటింగుల్లోనూ అధికారులు వార్నింగ్ ఇస్తున్నారు. అయినా కొందరు అదనపు డబ్బు కోసమే నౌకరీ చేస్తున్నట్టుగా తయారయ్యారు. జిల్లా ఏర్పడిన తరువాత పలువురు అధికారులు ఏసీబీకి చిక్కారు. నాలుగేళ్ల క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో క్రికెట్ బెట్టింగుల కేసులో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు ఏసీబీ కేసులో అరెస్టయ్యారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మరికొందరు ఏసీబీకి చిక్కారు. అప్పట్లో మంజీర నుంచి అక్రమంగా ఇసుక తరలింపు వ్యవహారంలోనూ పలువురు అధికారులపై ఆరోపణలు వచ్చాయి. గతేడాది నవంబర్ 14న లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అరుణ్ కుమార్‌తో పాటు స్టేషన్ రైటర్ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరచిపోకముందే అదే ఠాణాలో చేరిన ఎస్సై సుధాకర్ బుధవారం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు దొరికారు.

ఏసీబీకి పట్టుబడిన లింగంపేట ఎస్సై

- ఫైనాన్స్ పంచాయితీలో లంచం తీసుకుంటూ..
- కేసు చేస్తానని బెదిరింపులు.. డబ్బులు డిమాండ్



ఏసీబీకి పట్టుబడిన లింగంపేట్ ఎస్సై కండి సుధాకర్

ఖలీల్‌వాడి: ఫైనాన్స్‌పై తీసుకున్న కారు పంచాయితీలో తలదూర్చిన కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్సై కండి సుధాకర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట్‌కు చెందిన కమ్మరి కొండేశ్ స్విఫ్ట్ కారును ఫైనాన్స్‌లో కొనుగోలు చేసి కొన్ని రోజుల తరువాత స్థానికుడైన నవీన్‌గౌడ్‌కు అమ్మేశాడు. ఆ తరువాత నవీన్‌గౌడ్ కారును నిజామాబాద్‌లోని బోర్గాం(పి) లో ఉన్న సెకండ్ కార్ బజార్‌లో 2022లో విక్రయించాడు. దానిని కొనుగోలు చేసిన సెకండ్ కార్ బజార్ యజమాని తులసీ వెంకటస్వామి అలియాస్ స్వామి నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన చిరంజీవికి అమ్మేశాడు. అయితే చిరంజీవికి కారు అమ్మే సమయంలో ఫైనాన్స్ సంస్థకు నెలవారీ వాయిదాలు చెల్లించాలని అంగీకారం కుదుర్చుకున్నారు. కారు ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది కమ్మరి కొండేశ్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా.. ఆయన నవీన్‌గౌడ్ ద్వారా నిజామాబాద్‌కు వచ్చి కార్ బజార్ ఓనర్ తులసీ వెంకటస్వామి అలియాస్ స్వామిని కలిసి చిరంజీవిని పిలిపించి మాట్లాడించారు. అయినప్పటికీ చిరంజీవి వాయిదాలు చెల్లించకపోవడంతో కొండేశ్‌పై ఫైనాన్స్ సిబ్బంది ఒత్తిడి పెంచడంతో ఆయన లింగంపేట్ ఎస్సై కండి సుధాకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సెకండ్ కార్ బజార్ యజమాని స్వామిని లింగంపేట్ స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై.. కారుతోపాటు చిరంజీవిని తీసుకురావాలని చెప్పాడు. కారు చందూర్ మండల కేంద్రంలో ఉన్నట్లు గుర్తించి ఈనెల 20న లింగంపేట్ పీఎస్‌కు వెంకటస్వామి తీసుకెళ్లాడు. అదే రోజు స్వామిని ఎస్సై మధ్యాహ్నం 3 నుంచి 7.30 గంటల వరకు లాకప్‌లో ఉంచి, అతడి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. కేసు సెటిల్ చేసుకోవాలని, రూ.20 వేలు చెల్లించాలని, సీఐకి కూడా ఇవ్వాల్సి ఉంటుందని ఎస్సై బేరం మొదలుపెట్టాడు. చివరికి రూ.12,500 ఇచ్చేందుకు స్వామి ఒప్పుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం లింగంపేట్ నుంచి నిజామాబాద్‌కు వచ్చిన ఎస్సై సుధాకర్ స్వామికి ఫోన్ చేశాడు. వినాయక్‌నగర్‌లోని రుక్మిణి చాంబర్ వద్ద కారులో ఎస్సై సుధాకర్‌కు స్వామి నగదు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐలు శ్రీనివాస్, వేణుగోపాల్, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సైని హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ చెప్పారు. ఏసీబీకి పట్టుబడిన ఎస్సై సుధాకర్ స్వగ్రామం నవీపేట్ మండలం నాగేపూర్ అని పోలీసుల ద్వారా తెలిసింది.

లాకప్‌లో పెట్టాడనే పట్టించా..



ఎస్సై సుధాకర్ నన్ను లాకప్‌లో పెట్టి ఇబ్బంది పెట్టాడు. కారును తీసుకువెళ్లినా కేసు నమోదు చేస్తానని బెదిరించాడు. కారు ఫైనాన్స్ విషయంలో నా ప్రమేయం లేదని చెప్పినా లాకప్‌లో మూడున్నర గంటలపాటు ఉంచాడు. అందుకే ఏసీబీని ఆశ్రయించాను. కేసు కాకుండా డబ్బులు డిమాండ్ చేయడంతో పట్టించాను.

– తులసీవెంకటస్వామి, నిజామాబాద్

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- బల్దియా ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం మొదటిసారిగా మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 100 శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వార్డులో సానిటేషన్ సమస్యలు లేకుండా, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సానిటేషన్ అధికారులకు సూచించారు. పట్టణంలో నీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ స్పందన, ఇంజినీరింగ్, సానిటరీ, రెవెన్యూ, వాటర్‌వర్క్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మున్సిపల్ అధికారులు


బాన్సువాడ : బాన్సువాడ మున్సిపల్ ప్రత్యేక అధికారిగా నియమితులైన అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బల్దియా కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరి రాజుతో పాటు అధికారులు స్వాగతం పలికారు. అడిషనల్ కలెక్టర్ అధికారులతో మాట్లాడి ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు తెలుసుకున్నారు.

మోగిన ఎన్నికల నగారా!

- పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- వచ్చే నెల 3న నోటిఫికేషన్, 27న పోలింగ్
- అమలులోకి ఎన్నికల కోడ్.. నాలుగు పథకాల అమలుపై సందిగ్ధత

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. వచ్చేనెల 3న నోటిఫికేషన్ జారీ కానుంది. అదేనెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. ఇప్పటికే ఎన్నికల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా షెడ్యూల్‌తోపాటే ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో నాలుగు పథకాల అమలుపై సందిగ్ధత నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



మెదక్ –నిజామాబాద్ –ఆదిలాబాద్ –కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిల పదవీకాలం మార్చి నెలలో పూర్తవనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. బుధవారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. వచ్చే నెల 3న నోటిఫికేషన్ జారీ చేస్తారు. అదే రోజు నుంచి 10 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 11న నామినేషన్ల పరిశీలన, 13 వరకు విత్‌డ్రాకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఓట్లను లెక్కించనున్నారు.

ఆ పథకాల పరిస్థితేమిటో?

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌తోపాటే ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో అధికారిక కార్యక్రమాలు నెల రోజుల పాటు నిలిచిపోనున్నాయి. కాగా ప్రభుత్వం రైతుభరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పథకాలను గణతంత్ర దినోత్సవం రోజున లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామాల్లో నాలుగు పథకాలను అమలు చేశారు. అయితే ఎన్నికల కోడ్ వచ్చినందున మిగతా గ్రామాలలో ఆయా పథకాలు అమలు అవుతాయా? కోడ్ ఎత్తేసేంత వరకు ఆగిపోతాయా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

వేడెక్కనున్న రాజకీయం

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేయడానికి ఇప్పటికే డజన్ మందికిపైగా తెరపైకి వచ్చారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, కరపత్రాలతో ప్రచారం ముమ్మరం చేశారు. బీజేపీ ఇప్పటికే తన అభ్యర్థిగా అంజిరెడ్డిని ప్రకటించగా, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వి.నరేందర్‌రెడ్డి, ఎం.రమణారెడ్డి, ఎం.గంగాధర్ తదితరులు బరిలో నిలవడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీల మద్దతు లేకుండా ఎన్నికల బరిలో దిగుతున్న పలువురు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వివిధ వర్గాల వారితో సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో వివిధ సంఘాలు తమ అభ్యర్థులను ప్రకటించడంతో పాటు ప్రచారం కూడా చేపట్టాయి. తపస్ తమ అభ్యర్థిగా మల్క కొమురయ్యను ఇప్పటికే ప్రకటించింది. పీఆర్టీయూనుంచి వంగ మహేందర్‌రెడ్డి బరిలో దిగనున్నారు. టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ సంయుక్తంగా తమ అభ్యర్థిగా వై.అశోక్ కుమార్‌ను అభ్యర్థి గా ప్రకటించాయి. ఇతర సంఘాలూ ఎన్నికల బరిలో నిలిచేందుకు సమాలోచనలు చేస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో రాజకీయం వేడెక్కనుంది.

కామారెడ్డి జిల్లాలో ఓటర్ల వివరాలు..

పట్టభద్రుల ఓట్లు	:	15,876
ఉపాధ్యాయుల ఓట్లు	:	2,061

పట్టభద్రుల స్థానంపై ఫోకస్..

అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రధానంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కన్నేశాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన టి.జీవన్‌రెడ్డి గత ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. రాష్ట్రంలో అధికారంలో లేనప్పుడే ఎమ్మెల్సీ గెలిపించుకున్న కాంగ్రెస్ పార్టీ ఈసారి అధికారంలోకి రావడంతో కచ్చితంగా గెలిస్తేనే పరువు నిలబడుతుందని భావిస్తోంది. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీ బీజేపీకి ఎమ్మెల్సీ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. ఎందుకంటే మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు ఆ పార్టీకి చెందిన వారే ఉన్నారు. అలాగే కామారెడ్డి, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు, ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్, ఆదిలాబాద్, ముదోల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కూడా బీజేపీకి చెందిన వారే ఉన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పోటీలో ఉంటుందా లేదా అన్నది వెల్లడి కావాల్సి ఉంది.

గర్భస్రావ మందులతో యువతి మృతి

- రిఫర్ చేసిన పీఎంపీ రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: గర్భస్రావం మాత్రలు రిఫర్ చేసి ఓ యువతి మరణానికి కారణమైన పీఎంపీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏసీపీ బుధవారం వెల్లడించారు. మాక్లూర్ మండలానికి చెందిన యువతి, మెండోరా మండలం సావెల్‌కు చెందిన యువకుడు కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం కారణంగా యువతి గర్భం (2 నుంచి 3 నెలలు) దాల్చడంతో యువకుడు తన గ్రామంలో క్లినిక్ నిర్వహిస్తున్న ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన పీఎంపీ హరికృష్ణచారిని ఈనెల 4న సంప్రదించాడు. పీఎంపీ సూచించిన మాత్రలను యువకుడు అదే రోజు యువతికి ఇవ్వగా మూడు రోజుల తరువాత ఆమెకు కడుపు నొప్పితోపాటు బ్లీడింగ్ అయ్యింది. దీంతో యువతిని ఆమె తల్లి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. యువతికి గర్భస్రావమైందని, కిడ్నీ, లివర్‌కు ఇన్ఫెక్షన్ వచ్చిందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈనెల 10న హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో యువతి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పీఎంపీని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ఏడుగురు పీఎంపీలపై కేసులు

ఎలాంటి అర్హతలు లేకుండా నిజామాబాద్ డివిజన్‌లో ప్రజలకు వైద్యం చేస్తున్న ఏడుగురు పీఎంపీలపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెడికల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టి ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేశామన్నారు. ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో కె.గంగాధర్(ఇందల్‌వాయి), డిచ్‌పల్లి పీఎస్‌లో ఆర్ రాజేందర్(మానస క్లినిక్), ఎం వెంకటేశ్వర్(మణికంఠ క్లినిక్, మిట్టపల్లి), దత్తాద్రి(ప్రశాంత్ క్లినిక్, డిచ్‌పల్లి), గోలి సందీప్(లక్ష్మినరసింహ క్లినిక్, డిచ్‌పల్లి), ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏ మల్లేశం(చందన క్లినిక్, న్యాల్‌కల్ రోడ్), మోపాల్ పీఎస్‌లో విఠల్‌సింగ్(ఏ1), సూర మహేశ్‌కుమార్ (ఏ2)పై కేసులు నమోదైనట్లు వివరించారు.

'ఉపాధి హామీ'లో కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి టౌన్: ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం, నర్సరీలు, మరుగుదొడ్లు, ఆస్తి పన్ను, తాగునీరు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచించారు. నర్సరీల్లో నాటిన విత్తనాలు మొలకెత్తేందుకు రోజూ నీరు పట్టాలన్నారు. నిరుపేదలకు మంజూరు చేసిన మరుగుదొడ్లను నిర్మించుకునేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఆస్తిపన్ను వసూలు లక్ష్యాన్ని వచ్చేనెల 15లోగా చేరుకోవాలని సూచించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అందరి కృషితో ధాన్యం సేకరణలో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామని, ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జెడ్పీ సీఈవో చందర్, సీపీవో రాజారాం, డీఆర్‌డీవో సురేందర్, ఆర్డీవోలు రంగనాథ్‌రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వృద్ధాశ్రమం సందర్శన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని క్యాసంపల్లి వద్దనున్న వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి.నాగరాణి బుధవారం సందర్శించారు. వృద్ధులతో కాసేపు మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలనుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చన్నారు. చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు.

డిజిటల్ బస్సు యాత్ర ప్రారంభం



కామారెడ్డి టౌన్: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన డిజిటల్ బస్సు యాత్రను బుధవారం జిల్లా కేంద్రంలో డీఈవో ఎస్.రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు యాత్ర ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐటీ కంపెనీ ఉద్యోగులతో అవగాహన కల్పిస్తామని డీఈవో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీ గ్లోబల్ సంస్థ చైర్మన్ సందీప్, మక్తల్, టీఐటీఏ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రగ్బీ జిల్లా జట్ల ఎంపిక



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం రగ్బీ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారని, ఇందులో ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని రగ్బీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నీలం రవి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 1, 2, 3 తేదీలలో మంచిర్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మనోజ్, రవీందర్‌సింగ్, నవీన్, దిలీప్, సంతోష్, శోభ తదితరులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జిల్లా జట్టు..

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని లయోలా హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ విషయాన్ని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేశ్వర్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 85 కిలోలలోపు బరువున్న వారు 93985 71110 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సమావేశం కానున్నారు. ఈనెల 26న బల్దియా పాలకవర్గం పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శుక్రవారం బల్దియా అధికారులతో సమావేశమై పుర సమస్యలపై చర్చిస్తారని బీజేపీ నాయకులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో పారిశుధ్య, వాటర్‌వర్క్స్, రెవెన్యూ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

ఆర్ఎంపీలపై కేసు నమోదు

బాన్సువాడ : పట్టణానికి చెందిన ముగ్గురు ఆర్ఎంపీలపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఎలాంటి అర్హత లేకున్నా వైద్యం చేస్తున్నారంటూ వెంకటరెడ్డి, సురేశ్, ప్రకాష్‌లపై మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఇటీవల బాన్సువాడలో మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. అర్హతలు లేకున్నా వైద్యం చేస్తున్నట్లు గుర్తించి ముగ్గురిపై ఫిర్యాదు చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 11 మంది ఆర్ఎంపీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

'ఉద్యోగ భద్రత కల్పించండి'



భిక్కనూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సౌత్ క్యాంపస్ నుంచి ప్రారంభమైన బైక్‌ర్యాలీ బీటీ ఎస్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు యాలాద్రి, సునీత, వైశాలి, సరిత నరసయ్య, రమాదేవి శ్రీకాంత్, దిలీప్‌లు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



కామారెడ్డి టౌన్: గద్దర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గద్దర్‌కి పద్మశ్రీ అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కామారెడ్డి– ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, శివాజీ, శ్యాంరావు, అఖిల్‌రావు, రాంచంద్రం, శ్రీకాంత్, రంజిత్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో లింగంపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. మాసాని సాయిలు, బాలయ్య, భూపతి, లెగ్గల రాజు, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం వికటించడంతో 16 విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. భోజనం తిన్న గంట తర్వాత విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. దీంతో వారిని ఉపాధ్యాయులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు తెలిపారు.

చదువుల చెట్టుకు రజతోత్సవం

- వచ్చే నెల 23న నిర్వహించేందుకు ఏర్పాట్లు
- పూర్వ విద్యార్థులకు ఆహ్వానం
- ఉన్నత స్థాయిలో పూర్వ విద్యార్థులు



బాన్సువాడ: రెండున్నర దశబ్దాల క్రితం ఏర్పాటైన కళాశాల నేడు ఆదర్శంగా నిలుస్తోంది. 27 ఏళ్ల క్రితం ప్రారంభించిన కళాశాల ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టింది. వచ్చే నెల 23న ఈ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. బాన్సువాడకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్‌ఆర్ ఎన్‌కే (శ్రీరాంనారాయణ్‌ఖేడియా) డిగ్రీ కళాశాలను 1998, ఆగస్టు 27న అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. వేడుకలు నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. బాన్సువాడకు డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో స్థల సేకరణ చేస్తున్న క్రమంలో దేశాయిపేట్ సమీపంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేస్తే అందరికి అనుకూలంగా ఉంటుందని భావించి అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఫ్యాక్టరీ యజమాని శ్రీ రాంనారాయణ్‌ఖేడియా(పారిశ్రామికవేత్త–రాజస్తాన్)ను సంప్రదించారు. ఆయన సానుకూలంగా స్పందించి తన సొంత స్థలం(11.16 ఎకరాలు)లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అనుమతిచ్చారు. కానీ డిగ్రీ కళాశాలకు తన పేరు పెట్టాలని పట్టుబట్టడంతో అప్పటి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శ్రీరాంనారాయణ్‌ఖేడియా డిగ్రీ కళాశాలగా నామకరణం చేశారు. అలాగే కళాశాల పక్కన ఉన్న ఓ ఇండస్ట్రీ యజమాని బి.విఠల్ రెడ్డి తన సొంత నిధులతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు.

స్టాఫ్, ఇతర వివరాలు..

టీచింగ్ స్టాఫ్	42 మంది
నాన్ టీచింగ్ స్టాఫ్	19 మంది
డిపార్ట్‌మెంట్లు	17
కంప్యూటర్ ల్యాబ్‌లు	03
కంప్యూటర్లు	140
ల్యాబ్ టెక్నీషియన్లు	12
లైబ్రరీ	01
డిజిటల్ లైబ్రరీ	01
ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు	03
ఎన్‌సీసీ యూనిట్	01

అందుబాటులో ఉన్న గ్రూపులు..

కళాశాలలో బీఏ, బీకాం, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, ఎంజెడ్‌సీఎస్, పీజీ తెలుగు, పీజీ ఇంగ్లీషు అందుబాటులో ఉన్నాయి. సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు 52 తరగతి గదులు ఉన్నాయి. ఈ కళాశాలలో ఉన్న వసతులను దృష్టిలో ఉంచుకుని 2022–23 సంవత్సరంలో బీ+ న్యాక్ గుర్తింపు లభించింది. 2024–2025లో అటానమస్ (స్వయంప్రతిపత్తి) లభించింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబంధించి ప్రస్తుతం 1,338 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



సైన్స్ ల్యాబ్



కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్

ఇక్కడ చదివి పోలీస్ అయ్యా



ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలలో చదివి నేడు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నా. అప్పట్లో ఈ కళాశాలలో ఎక్కడా లేని విధంగా సౌకర్యాలు ఉండేవి. ల్యాబ్‌లో ఉన్న పరికరాలు మరెక్కడా కూడా ఉండవు. ఇలాంటి గొప్ప కళాశాలలో చదివి నేడు పోలీసు ఉద్యోగం చేస్తున్నందుకు గర్వంగా ఉంది. –చతుర్వేది, సీఐ

ప్రభుత్వ ఉద్యోగం సాధించా..



బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలలో చదివిన ప్రతీ ఒక్కరు ఏదో ఓ ఉద్యోగంలో చేరారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించానంటే కేవలం డిగ్రీలో తమ అధ్యాపకులు చెప్పిన చదువులే కారణం. ఏ ప్రైవేటు కళాశాలలో కూడా ఇన్ని సౌకర్యాలు ఉండవు. చూస్తుండగానే 20 ఏళ్లు గడిచిపోయాయి. – శేఖర్, తహసీల్దార్, మాక్లూర్

వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నాం



ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రారంభమై 25 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కళాశాలలో సిల్వర్ జూబ్లి వేడుకలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పూర్వ విద్యార్థులందరినీ ఆహ్వానిస్తున్నాం. వివిధ హోదాలో ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులకు సన్మానిస్తాం. –వేణుగోపాల్ స్వామి, ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల

నా భూమి నాకు ఇప్పించండి



వినతి పత్రం అందజేస్తున్న బాధితురాలు

బాన్సువాడ: పట్టణంలో తన పట్టా భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, ఆ భూమిని తనకు ఇప్పించాలని బుధవారం బాన్సువాడకు చెందిన ఓట్లంగారి నాగవ్వ సబ్ కలెక్టర్ కిరణ్మయిని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని సర్వే నంబర్–787/2లో 1.20 గుంటల భూమి ఉందని, దానికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం కూడా ఉందని అన్నారు. నా భర్త, కుమారుడు, కోడలు మృతి చెందడంతో కొన్నేళ్లుగా వేరే గ్రామంలో ఉంటున్నానని, తనకు తెలియకుండా ఇతరులు తన పట్టా భూమిని ఆక్రమించుకున్నారని తెలిపారు. బాధితురాలితో పాటు బీజేపీ నాయకులు కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, దాసరి గంగాధర్ తదితరులున్నారు.

హిందూ దేవుళ్ల జోలికొస్తే వదిలిపెట్టం



ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందువులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మహా కుంభమేళాపై ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో హిందూ సంఘాలు సభ్యులు ఆందోళనలకు దిగారు. రోడ్డుపై బైఠాయించి మల్లికార్జున్ ఖర్గే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందూ దేవుళ్ల జోలికొస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. హిందూ సంఘాల సభ్యులు కృష్ణ పంతులు, తానాజీ, రాజుసేట్, యోగిసేట్, పండరి, రాము, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాన్కంపేట్ అటవీ ప్రాంతంలో చిరుత సంచారం



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జాన్కంపేట్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని అటవీ అధికారులు నిర్ధారించారు. మంగళవారం సాయంత్రం బ్యాంకు అధికారి బైక్‌ను చిరుత వెంబడించిందని సమాచారం అందడంతో చిరుత ఆనవాళ్లను గుర్తించేందుకు బుధవారం అటవీప్రాంతంలో పర్యటించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌రెడ్డి అటవీప్రాంతంలో చిరుత పాదముద్రలను గుర్తించారు. ఠాణాకలాన్, జానకంపేట్ అడవిలో పది కిలోమీటర్ల ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని, గ్రామస్తులు ఒంటరిగా బయట తిరుగొద్దని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు చిరుతను బంధించేందుకు బోనులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.

'ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి'



కామారెడ్డి టౌన్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఏఎస్పీ చైతన్యారెడ్డి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తొలి గంట సమయం చాలా కీలకమని, క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలిస్తే ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, దేవునిపల్లి ఎస్సై రాజు, కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చంపుతారనే భయంతో భార్య హత్య

- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు



స్వప్న (ఫైల్)

రెంజల్(బోధన్): భార్యపై అనుమానం.. ప్రియుడితో కలిసి తనను హత్య చేస్తుందనే భయంతో ఓ వ్యక్తి తన భార్యను హతమార్చాడు. ఈ ఘటన రెంజల్ మండలం బోర్గాం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. బోర్గాం గ్రామానికి చెందిన చిరడి పోతన్న, నీరడి స్వప్న(35) భార్యాభర్తలు. స్వప్న మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని పోతన్న అనుమానించేవాడు. అంతేగాక ప్రియుడితో కలిసి తనను చంపుతుందేమోనని భయపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం పొలం వద్ద భార్యను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేశాడు. అదేరోజు రాత్రి భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మళ్లీ తానే బుధవారం ఉదయం స్టేషన్‌కు వెళ్లి తన భార్యను చంపినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని జాలార్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ సీఐ విజయ్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్



ఇందల్వాయి: చోరీ కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. ఈ నెల 25న ఇందల్వాయికి చెందిన ఆసది రాజేశ్వరి ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన ఆసది రాజేశ్ చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

కామారెడ్డి టౌన్: పోక్సో కేసులో ఓ నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి లాల్ సింగ్ నాయక్ తీర్పు వెల్లడించారని ఎస్పీ సింధూశర్మ బుధవారం తెలిపారు. వివరాలు.. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక ఇంటి బయట ఆడుకుంటుండగా 2020 సెప్టెంబర్ 27న అడ్లూర్ శివారులోని కామారెడ్డి రాజీవ్ గృహకల్పకు చెందిన షేక్ కరీం అలియాస్ కరిముల్లా లైంగిక దాడికి పాల్పడ్డాడు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

భూమి కోసం తండ్రి హత్య

ఎడపల్లి: భూమి కోసం కన్న తండ్రిని కుమారుడు హత్య చేసినట్లు బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు తెలిపారు. ఎడపల్లి మండలం జాన్కంపేటలో జరిగిన హత్య కేసు వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. జాన్కంపేట్‌కు చెందిన నర్సయ్య(50)కు కొడుకు రాజశేఖర్, కూతురు ఉన్నారు. కూతురి పెళ్లి అయింది. రాజశేఖర్ మద్యానికి బానిస అయ్యాడు. తన తండ్రి పేరిట ఉన్న రెండు ఎకరాల భూమిని చెల్లెలి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తాడని భావించి మంగళవారం రాత్రి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో రాజశేఖర్ ఈలపీటతో దాడి చేయడంతో నర్సయ్య మృతి చెందాడు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

ఖలీల్‌వాడి: రైలులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక పట్టుకున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ సుబ్బారావు తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో దేవగిరి, నాందేడ్–సంబల్పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను బుధవారం ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీ చేశారు. రైళ్లలో సీట్ల కింద ఉన్న నల్లబెల్లం, పటిక సంచులు గుర్తించినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.3.80 లక్షల ఉంటుదన్నారు. వాటిని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మంత్రాల నెపంతో దాడి

రెంజల్(బోధన్):మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో స్థానికులు ఓ వ్యక్తిని చితకబాది పోలీసులకు అప్పగించారు. రెంజల్ మండలం సాటాపూర్‌లో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. రామాయంపేటకు చెందిన ఆనంద్ రాత్రిపూట అనుమానాస్పదంగా తిరుగుతూ ఇళ్ల ముందు నిమ్మకాయలు పడేస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. దీంతో చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు.

దొంగల హల్‌చల్

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్దతడ్గూర్, చిన్నతడ్గూర్, ఖరగ్ గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మూడు గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడ్డారు. వివరాలు.. పెద్దతడ్గూర్‌కి చెందిన కోండవార్ చంద్రకాంత్ కుటుంబ సభ్యులు మహారాష్ట్రలో ఉంటారు. వీరు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. లోపలక ఏమీ దొరకలేదు. అనంతరం చిన్నతడ్గూర్, ఖరగ్ గ్రామాల్లో సైతం మూడు ఇళ్లలో చోరీ చేశారు. బంగారు, వెండి ఆభరణాలు పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సాయిలు తెలిపారు.

ఇరువర్గాల మధ్య గొడవ

ఖలీల్‌వాడి: నగరంలోని సిటీ హాస్పిటల్ వద్ద ఉన్న స్నూకర్ పార్లర్ వద్ద బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. బర్కత్‌పురాకు చెందిన ముల్లా బాసస్‌ఖాన్‌తో గున్నా గ్యాంగ్ మాట్లాడుతుండగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో బాసస్‌ఖాన్‌పై స్నూకర్ స్టిక్‌తో దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

మాఘమాస స్నానానికి వెళ్లి బాలుడి మృతి



శేఖర్(ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మాఘమాస స్నానానికి కుటుంబ సభ్యులతో వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన తాడ్వాయి మండలం సంతాయిపేట శివారులోని భీమేశ్వర ఆలయం వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. రాజంపేట మండలంలోని కొండాపూర్ గ్రామపరిధి గుడితండాకు చెందిన రమావత్ రాజు, శాంతి దంపతుల కుమారుడు శేఖర్(16) పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం మాఘ అమావాస్య సందర్భంగా స్నానం చేయడానికి తల్లిదండ్రులతో కలిసి సంతాయిపేటలో భీమేశ్వర ఆలయం వద్ద గల వాగుకు వెళ్లాడు. భీమేశ్వర వాగులో స్నానం చేయడానికి దిగిన శేఖర్ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. అక్కడే ఉన్న కొందరు వాగులోకి దూకి శేఖర్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు.

పని ఒత్తిడితో భగీరథ ఏఈఈ ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి



సాయిచరణ్ (ఫైల్)

డిచ్‌పల్లి: ధర్పలి మండలంలో నీటి పారుదల శాఖ (మిషన్ భగీరథ)లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న కత్తులపురం సాయిచరణ్ (30) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన సాయిచరణ్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో నివసిస్తున్నాడు. ఆరు నెలల క్రితం మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం సాధించి ధర్పల్లి మండలంలో పని చేస్తున్నాడు. ఇటీవల ఉద్యోగంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని తల్లిదండ్రులతో చెప్పి మానసికంగా బాధపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ధర్పల్లిలో డ్యూటీకి వెళుతున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయలు దేరాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సాయిచరణ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి అక్క హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిని చంపిన తనయుడి రిమాండ్

- విచారణలో వెలుగులోకి మరో హత్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

రుద్రూర్: కోటగిరి మండలం జల్లాపల్లి ఫారంలో మంగ్లీబాయిని హత్య చేసిన కేసులో ఆమె కుమారుడు నేనావత్ రాములును పోలీసులు విచారిస్తుండగా మరో హత్య వెలుగులోకి వచ్చింది. కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రుద్రూర్ సీఐ కృష్ణ వివరాలు వెల్లడించారు. జల్లాపల్లి ఫారానికి చెందిన రాములు మద్యం, జల్సాలకు బానిసయ్యాడు. తన తల్లి మంగ్లీబాయి (72) వద్ద ఉన్న డబ్బులు, నగల కోసం ఈ నెల 26న రాత్రి ఆమెను గ్రామంలోని నీటి కుంటలో ముంచి హత్య చేశాడు. పోలీసులు బుధవారం పోతంగల్ చెక్‌పోస్టు వద్ద రాములును అదుపులోకి తీసుకుని విచారించగా తల్లిని చంపినట్టు ఒప్పుకున్నాడు. దీంతో పాటు మూడు నెలల క్రితం గైని మాదమ్మ అనే మహిళను కూడా హత్య చేసినట్టు విచారణలో వెల్లడించాడు. కోటగిరి మండలం నాగేంద్రపురం గ్రామానికి చెందిన మాదమ్మను కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగెడ్గి శివారులో గొంతు నులిమి చంపి కాలువలో పడేశాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు తీసుకున్నట్లు రాములు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్టు సీఐ వివరించారు. సమావేశంలో కోటగిరి ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగనోట్ల కేసులో మరొకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

గాంధారి: గాంధారి మండలం చద్మల్ తండాలో దొంగనోట్ల చెలామణి కేసులో బుధవారం మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. చద్మల్ తండాలో సంక్రాంతి సందర్భంగా లక్ష్మమ్మ గుడివద్ద జరిగే జాతరలో వచ్చిన కానుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తండావాసులకు అప్పుగా ఇస్తారు. ఈ క్రమంలో కొందరు అసలు నోట్ల కట్టల్లో దొంగనోట్లు ఉంచి ఇచ్చారు. అప్పు తీసుకున్న వారు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ కేసులో ఈ నెల 24న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు మారు సుకోల తిరుపతి అలియాస్ రాజు, జగన్ పరారీలో ఉండగా తిరుపతిని బుధవారం మంచిర్యాల జిల్లా అన్నారం గ్రామంలో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సదాశివ నగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి



రుద్రూర్: రుద్రూర్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన దాల్‌మల్క బాబయ్య (22) వల చుట్టుకొని మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం ఉదయం నుంచి బాబయ్య కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఈ క్రమంలో చెరువులో మృతదేహం తేలింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజి మార్కెట్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. మృతుడిపై నలుపు రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. సదరు వ్యక్తి నగరంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిపారు.

ఇంట్లో మృతదేహం

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మండలం గోవిందపేట్ గ్రామంలో ఓ ఇంట్లో మృతదేహం ఉన్నట్లు బుధవారం స్థానికులు గుర్తించారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కిటికీలోనుంచి చూడగా మృతదేహం కనిపించింది. ఆ ఇంట్లో స్వప్న, శ్రీనివాస్ అనే దంపతులు ఉంటున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం సభ్యులు వచ్చే వరకు ఆధారాలు చెదిరిపోకుండా తాళం తెరిచి లోనికి వెళ్లలేదు. గురువారం క్లూస్‌టీం సభ్యులతో కలిసి మృతదేహాన్ని పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.